

ఇక ఆటలు ఆడుకోవచ్చు..

భద్రాచలంలో క్రీడామైదానం ఏర్పాటుకు ఐటీడీఏ పీఓ రాహుల్ దృష్టి సారించడంతో త్వరలోనే క్రీడాకారుల కల తీరనుంది. 8లో



గిరిజన భూములతో వ్యాపారం?

ఏజెన్సీలో భూములను కారుచౌకగా తీసుకుంటున్న కొందరు అధికారులతో కుమ్మక్కై పట్టాలు సృష్టించి ఎక్కువ ధరకు అమ్ముతున్నారని తెలుస్తోంది. 8లో



వాతావరణం

జిల్లాలో మంగళవారం ఉదయం ఎండ ప్రభావం ఉండదు. మధ్యాహ్నానికి పెరిగినా సాయంత్రానికి సాధారణ స్థాయికి చేరుతుంది.

రామా... వసతి కష్టాలు కనుమా..

రంగనాయకుల గుట్టపై శిథిలావస్థలో ఉన్న టీటీడీ సత్రం (ఇన్‌సెట్) పూర్తిగా శిథిలమైన అన్నవరం సత్రం



దక్షిణ అయోధ్యగా భావించే భద్రాచలానికి సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు, పర్యాటకులకు వసతి కష్టాలు తీరడం లేదు. ప్రధాన ఉత్సవాల సమయంలో ఈ సమస్య మరింత ఎక్కువగా ఉంటోంది. ఆ సమయంలో కాస్త హడావుడి చేసే అధికారులు ఆతర్వాత పూర్తి స్థాయిలో దృష్టి సారించకపోవడంతో శాశ్వత పరిష్కారం లభించడం లేదు. 2027లో గోదావరి పుష్కరాలు జరగనున్న నేపథ్యాన ఇప్పటినుంచే వసతి గదుల నిర్మాణానికి ప్రణాళికాయుతంగా ముందుకు సాగితే ఇక్కట్లు తీరనున్నాయి.

– భద్రాచలం

భద్రాచలంలో గుట్టపై శిథిలమైన సత్రాలు, కాటేజీలు

- పునఃనిర్మాణం చేస్తేనే కష్టాల నుంచి ఉపశమనం
- వసతి ఇక్కట్లు తీర్చాలని భక్తుల విన్నపాలు

టీటీడీ, అన్నవరం సత్రాలు..

గతంలో భద్రాచలం రామయ్య దర్శనానికి వచ్చే సామాన్య భక్తులకు ఏళ్ల తరబడి టీటీడీ, అన్నవరం ఆలయ పరిధిలోని సత్రాలు ఆసరాగా నిలిచాయి. అయితే, అవన్నీ 1950, 1960 నాటి కట్టడాలు కావడంతో పూర్తిగా శిథిలమయ్యాయి. తిరుమల తిరుపతి దేవస్థానం నూతనంగా సీఆర్‌ఓ కార్యాలయం వెనుక మారుతి సదనం పేరుతో వసతి గదుల నిర్మాణం చేపట్టి దేవస్థానానికి అప్పగించింది. కానీ పైన ఉన్న టీటీడీ సత్రం, అన్నవరం సత్రం మాత్రం మరమ్మతులకు నోచుకోలేదు. వీటి స్థానంలో బహుళ అంతస్తులతో కూడిన భవనాలు నిర్మిస్తే ఉత్సవాల సమయంతో పాటు వారాంతాలు, సెలవు దినాల్లో భక్తులకు తక్కువ ఖర్చుతో వసతి సమకూరుతుంది.

గోదావరి పుష్కరాలే లక్ష్యంగా...

గోదావరి పుష్కరాలకు తెలంగాణ భక్తులు అత్యధికంగా భద్రాచలానికే వస్తారు. 2015లో గోదావరి పుష్కరాలకు లక్షలాది మంది భక్తులు పోటెత్తారు. 2027లో సైతం ఇంతకు మించి భక్తులు వచ్చే అవకాశం ఉంది. ఈ నేపథ్యాన భద్రాచలం దేవస్థానం ఆధ్వర్యాన ఇప్పటి నుంచే ప్రణాళిక రూపొందించి అమలు చేయాలని పలువురు కోరుతున్నారు. అభయాంజనేయస్వామి ఆలయం వద్ద, సూపర్ బజార్ సెంటర్, అంబసత్రం వైపు ఉన్న దేవస్థానం భూముల్లో వసతి గదుల నిర్మాణానికి అవకాశముంది. ఇక ఆంధ్ర ప్రదేశ్‌లోని పురుషోత్తపట్నంలో ఉన్న దేవస్థానం భూముల్లోనూ షిర్డీ, తిరుపతి మాదిరి నిర్మాణాలు చేపడితే మేలు జరుగుతుంది. ఆ దిశగా దేవస్థానం అధికారులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలనే విన్నపాలు వెల్లువెత్తుతున్నాయి.

ఉన్నాయి కానీ లేనట్టే...

దశాబ్దాల క్రితం భద్రాచలం రంగనాయకుల గుట్టపైన వసతి గదులతో కూడిన సత్రాలు ఉండేవి. వీఐపీల కోసం ఒకటి, రెండు సత్రాలు ఉండగా.. కాలక్రమంలో ఆలయం చుట్టుపక్కల ప్రైవేట్ లాడ్జీలతో పాటు దేవస్థానం వసతి గదులను సైతం నిర్మాణమయ్యాయి. దీంతో రంగనాయకుల గుట్టపై వీవీఐపీల కోసం కాటేజీలను నిర్మించారు. గుట్టపై 28కు పైగా కాటేజీలు ఉండగా, పర్యవేక్షణ లేకపోవడంతో అవి వాడకంలో లేకుండా పోయాయి. ప్రస్తుతం పది కాటేజీలు ఉపయోగంలో ఉండగా వీటిలో సగానికి పైగా ప్రైవేట్ యాజమాన్య పరిధిలోనే ఉన్నాయి. మరో రెండింటిని దాతల సాయంతో నిర్మిస్తున్నారు. అయితే, వినియోగంలో లేని కాటేజీలకు మరమ్మతులు చేయడంతో పాటు పూర్తి స్థాయిలో శిథిలమైన వాటి స్థానంలో బహుళ అంతస్తుల వసతి గదుల నిర్మాణానికి అవకాశమున్నా ఆ దిశగా ఎవరూ దృష్టి సారించడం లేదు.

గదుల నిర్మాణానికి ప్రణాళిక



దేవస్థానానికి చెందిన ఖాళీ భూముల్లో వసతి గదుల నిర్మాణానికి ప్రణాళిక చేస్తున్నాం. పట్టణంలోని స్థలాల్లోనే కాక పురుషోత్తపట్నంలోని ఆలయ భూముల్లోనూ పుష్కరాల దృష్ట్యా ప్రతిపాదనలను సిద్ధం చేస్తున్నాం. వీటిని ప్రభుత్వం, దేవాదాయ శాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాను. అంతేకాక గుట్టపై కాటేజీలను వినియోగంలోకి తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నాం.

– ఎల్.రమాదేవి, ఈఓ, రామాలయం

న్యూస్‌రీల్

ముత్తంగి అలంకరణలో రామయ్య



కల్యాణం జరిపిస్తున్న అర్చకుడు

భద్రాచలంటౌన్: భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో స్వామివారు సోమవారం ముత్తంగి అలంకరణలో దర్శనమిచ్చారు. తెల్లవారుజామున అర్చకులు గర్భగుడిలో సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన, తదితర పూజలు చేశారు. అనంతరం స్వామివారి ఉత్సవమూర్తులను బేడా మండపంలో కొలువుదీర్చారు. ఆపై విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం జరిపించాక స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్య కల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు.

నిత్యాన్నదానానికి విరాళం

శ్రీసీతారామచంద్ర స్వామి ఆలయంలో జరిగే నిత్యాన్నదానానికి వరంగల్‌కు చెందిన వీరస్వామి–విమల దంపతులు సోమవారం రూ.లక్ష విరాళంగా అందజేశారు. అలాగే, కొత్తగూడెంకు చెందిన బాబు–కమలమ్మ దంపతులు రూ.50 వేల విలువైన 600 గ్రాముల వెండి అభిషేకం జల్లెడను ఈఓ ఎల్.రమాదేవికి అందజేశారు.


బ్లాస్టింగ్ టెక్నాలజీలో డాక్టరేట్

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కొత్తగూడెం కార్పొరేట్ ఏరియాలోని ప్రాజెక్ట్ ప్లానింగ్ విభాగం అసిస్టెంట్ మేనేజర్ సీహెచ్.వెంకటరమణ ఓసీల్లో నిర్వహించే బ్లాస్టింగ్ టెక్నాలజీలో డాక్టరేట్ సాధించారు. బ్లాస్టింగ్ సమయాన ఇబ్బందులను తగ్గించే అంశంపై ఆయన చేసిన పరిశోధనకు నాగపూర్ నిట్ నుంచి డాక్టరేట్ ప్రకటించారు. ఈ సందర్భంగా వెంకటరమణను సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్, డైరెక్టర్లు అభినందించగా, సీపీపీ జీఎం సాయిబాబు, ఏజీఎం గోనే శ్రీకాంత్ తదితరులు సోమవారం సన్మానించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ ఓసీల్లో బ్లాస్టింగ్ సమయాన పెద్ద శబ్దంతోపాటు దుమ్ము, ధూళి వచ్చేవని తెలిపారు. కానీ అలా రాకుండా అనుసరించాల్సిన విధానాలపై వెంకటరమణ పరిశోధనలు చేయడం అభినందనీయమని వెల్లడించారు.

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

కొత్తగూడెంఅర్బన్: ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలను ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ ఆదేశించారు. క్యాంపు కార్యాలయంలో సంబంధిత శాఖల అధికారులతో సోమవారం సమావేశమైన ఆయన మాట్లాడుతూ ఈనెల 22నుంచి 27వ తేదీ వరకు ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలు జరుగుతాయని తెలిపారు. మొత్తం 7,635 మంది విద్యార్థులు హాజరు కానుండగా, 24 కేంద్రాలు ఏర్పాటు చేశామని వెల్లడించారు. గ్రామీణ ప్రాంత విద్యార్థుల కోసం ఆర్టీసీ బస్సులు నడిపించాలని, పరీక్షల సమయంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా చూడాలని సూచించారు. ఎండల నేపథ్యాన కేంద్రాల్లో వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బందిని నియమించాలని కలెక్టర్ సూచించారు. జిల్లా ఇంటర్మీడియట్ శాఖ అధికారి సీహెచ్.వెంకటేశ్వరరావుతో పాటు వివిధ శాఖల అధికారులు సులోచనరాణి, జయలక్ష్మి, సీహెచ్.శ్రీనివాస్, చిన్న యాకయ్య, అహ్మద్, రమణారావు తదితరులు పాల్గొన్నారు.

వాహనాల పన్ను వసూళ్లపై దృష్టి



పురుషోత్తంకు మొక్క అందజేస్తున్న అధికారులు

కొత్తగూడెంఅర్బన్: జిల్లాలోని వాహనాలకు నిర్దేశించిన పన్నులు వసూలు చేయడంపై ఉద్యోగులు దృష్టిసారించాలని రవాణా శాఖ వరంగల్ ఇన్‌చార్జ్ డిప్యూటీ కమిషనర్ పురుషోత్తం సూచించారు. కొత్తగూడెం రవాణా శాఖ కార్యాలయాన్ని సోమవారం తనిఖీ చేసిన ఆయన ఉద్యోగులకు సూచనలు చేశారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ వాహనాలు నిర్ణీత సమయంలో పన్నులు చెల్లించేలా అవగాహన కల్పించాలని, లేనిపక్షంలో జరిమానా విధించాలని తెలిపారు. అలాగే, విద్యాసంవత్సరం ప్రారంభం కానున్నందున విద్యాసంస్థల బస్సుల ఫిట్‌నెస్‌ను తనిఖీ చేయాలని సూచించారు. జిల్లా రవాణా అధికారి వెంకటరమణ, కొత్తగూడెం ఎంవీఐలు మనోహర్, నిర్మలారెడ్డి, వెంకటపుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి రెస్క్యూ స్టేషన్‌లో ఎస్పీ



పరికరాలను పరిశీలిస్తున్న ఎస్పీ రోహిత్‌రాజు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కొత్తగూడెం ఏరియా 4 ఇంక్‌లైన్‌లోని రెస్క్యూ స్టేషన్‌ను ఎస్పీ రోహిత్‌రాజు సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఉద్యోగులు రెస్క్యూ ఆపరేషన్లలో వినియోగించే పరికరాలు, తీసుకునే జాగ్రత్తలు, ఇప్పటి వరకు చేసిన ఆపరేషన్ల వివరాలను ఇన్‌చార్జ్ అనంతరామయ్య వివరించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ క్లిష్ట పరిస్థితుల్లో సింగరేని ఉద్యోగులు చేపట్టే రెస్క్యూ ఆపరేషన్లు పలువురి ప్రాణాలను నిలబెడుతున్నాయని అభినందించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ రహమాన్, సీఐలు రమేష్‌కుమార్, చెన్నూరు శ్రీనివాస్, సింగరేణి అధికారులు కోటిరెడ్డి, తావురియా, అభిలాష్ తదితరులు పాల్గొన్నారు. డీఎస్పీ రెహమాన్‌తో పాటు వివిధ విభాగాల ఉద్యోగులు చెన్నూరు శ్రీనివాస్, కోటిరెడ్డి, తావురియా, అభిలాష్ తదితరులు పాల్గొన్నారు.

నెట్‌బాల్ టోర్నీలో జైత్రయాత్ర

ఖమ్మం స్పోర్ట్స్: ఇటీవల జనగామలో జరిగిన రాష్ట్రస్థాయి సబ్‌జూనియర్ నెట్‌బాల్ పోటీల్లో ఉమ్మడి జిల్లా క్రీడాకారులు ప్రతిభ చాటారు. సంప్రదాయ నెట్‌బాల్ విభాగంలో బాలుర జట్టు తృతీయస్థానం సాధించింది. అలాగే, సబ్ జూనియర్ విభాగంలో జిల్లా బాలబాలికల జట్లు ద్వితీయస్థానంలో నిలిచాయి. అంతేకాక ఈనెల 25నుంచి మధ్యప్రదేశ్‌లో జరగనున్న జాతీయస్థాయి పోటీల్లో పాల్గొన్న రాష్ట్ర జట్టులో జిల్లా బాలబాలికలు పది మంది స్థానం దక్కించుకున్నారు. బాలురలో సాన్‌హిత్, హసిత్, సాకేత్, సంజయ్, నేహాల్, సూర్య ఎంపికకాగా, బాలికల జట్టుకు అవంతిక, హరిణి, రిత్వికహస్ర, సింధు ఎంపికయ్యారు. ఈసందర్భంగా క్రీడాకారులను నెట్‌బాల్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు దీప్తి, కార్యదర్శి ఎస్.ఫణికుమార్, కోచ్ పీ.వీ.రమణ అభినందించారు.

నమ్మాలి.. ఇది పంట కాలువే..



పునుకుల వద్ద మూసుకుపోయిన కిన్నెరసాని కాల్వ

వానాకాలం పంటల సీజన్ సమీపిస్తోంది. మరో పక్షం దాటితే దుక్కులు దున్నడం, విత్తనాలు వేయడానికి రైతులు సిద్ధమవుతున్నారు. కానీ అధికారులు మాత్రం పంట కాల్వలను బాగు చేయడంపై దృష్టి సారించకపోవడం విమర్శలకు తావిస్తోంది. పాల్వంచ మండలం కిన్నెరసాని ప్రాజెక్టు నుంచి ఏడు కి.మీ. పొడవైన కుడి కాల్వలో పిచ్చిమొక్కలు పెరిగి చిట్టడివిని తలపిస్తోంది. అందులో నుంచి ప్రాజెక్టు నీళ్ల మాటేమిటో కానీ నీటిధార కూడా ముందుకు వెళ్లే పరిస్థితి కానరావడం లేదు. అలాగే, రాళ్లవాగుకు చెందిన కాల్వ సైతం కారెగట్టు వద్ద ఇలాగే మూసుకుపోయింది. ఎండాకాలంలో నీటి సరఫరా లేనప్పుడు స్పందించాల్సిన అధికారులు పట్టించుకోకపోవడంతో ఈ పరిస్థితి నెలకొందని.. ఇకనైనా స్పందిస్తే వానలు మొదలయ్యేనాటికి కాల్వలు బాగవుతాయని రైతులు చెబుతున్నారు.

– పాల్వంచరూరల్

వినతుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి

గ్రీవెన్స్ డేలో కలెక్టర్ జితేష్ వి.పాటిల్



దరఖాస్తులను పరిశీలిస్తున్న కలెక్టర్ జితేష్ వి.పాటిల్

కొత్తగూడెంఅర్బన్: ప్రతీ సోమవారం ప్రజావాణి(గ్రీవెన్స్ డే)లో అందే ప్రతీ దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కారంపై దృష్టి సారించాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం ఆయన ప్రజావాణిలో భాగంగా ప్రజల నుంచి దరఖాస్తులు, వినతిపత్రాలు స్వీకరించారు. అనంతరం అధికారులతో సమావేశమై పరిశీలన, పరిష్కారంపై సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీఓ విద్యాచందన, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఫిర్యాదుల్లో కొన్ని...

- చంద్రుగొండ మండలం తిప్పనపల్లికి నివసిస్తున్న తోట భార్గవి తల్లి నుండి సంక్రమించిన భూమి సాగును సోదరులు అడ్డుకుంటున్నారని ఫిర్యాదు చేసింది.
- పినపాక మండలం కరకగూడెం జీపీ పరిధిలోని చోప్పాలా, నర్సాపురం గ్రామస్తులు రోడ్డు సౌకర్యం కోసం విన్నవించారు.
- అశ్వాపురం మండలం మొండికుంటకు చెందిన నోముల లక్ష్మి 2024 వరదల్లో ఇల్లు కొట్టుకుపోయినందున ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని కోరారు.
- లక్ష్మీదేవిపల్లి మండలం బోరింగ్ తండాకు నూనావత్ జగన్‌మోహన్‌దాస్ రోడ్డు విస్తరణలో తాను కిరాణా షాప్‌ను కోల్పోయినందున న్యాయం చేయాలని వినతిపత్రం అందజేశారు.
- బూర్గంపాడు మండలం మొరంపల్లి బంజరకు చెందిన జివాజి రమాదేవి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని కోరారు.
- ములకలపల్లి మండలంలో జరుగుతున్న సీతారామ ప్యాకేజ్–3 పనులకు సంబంధించి విలువైన రాళ్లను గుర్తుతెలియని వ్యక్తులు అక్రమంగా తరలిస్తున్నందున చర్యలు తీసుకోవాలని కొత్తూరు గ్రామానికి చెందిన ఆంగోతు సుధాకర్ ఫిర్యాదు చేశారు.

పూడికతీత పనులకు రూ.167.7 లక్షలు

కొత్తగూడెంఅర్బన్: సింగరేణి మణుగూరు ఏరియా ఆధ్వర్యాన చెరువుల పూడికతీతకు గాను రూ.167.7లక్షలు కేటాయించారు. ఈ నిధులతో మణుగూరులోని కోడిపుంజుల వాగు, సమితి సింగారం చెరువు, పొడపాట్రాల చెరువు, ఎర్ర లక్ష్మయ్య కుంట పూడికతీత పనులు చేపడుతారు. తద్వారా వర్షాకాలం ఎక్కువ నీటి నిల్వకు అవకాశం ఏర్పడుతుందని, సమీప ప్రాంతాల్లో భూగర్భ జలాలు పెరుగుతాయని అధికారులు తెలిపారు. ఈమేరకు నిధుల కేటాయింపు పత్రాలను కలెక్టర్ పాటిల్‌కు సోమవారం సింగరేణి అధికారులు అందజేశారు. సీపీఓ సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.

సమానత్వం కోసం పోరాడేది ఎర్రజెండానే..

సుందరయ్య వర్ధంతి సభలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ



సమావేశంలో మాట్లాడుతున్న జాన్‌వెస్లీ

తల్లాడ: సమానత్వం, సౌభ్రాతృత్వం కోసం పోరాడేది ఎర్ర జెండా మాత్రమేనని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ స్పష్టం చేశారు. పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి సందర్భంగా ఖమ్మం జిల్లా తల్లాడ మండలం కుర్నవల్లిలో సోమవారం రాత్రి జరిగిన సభలో ఆయన మాట్లాడారు. దేశంలో కుల, మత విద్వేషాలు పెరుగుతుండగా, ఇందుకు పాలకులు వత్తాసు పలుకుతున్నారని పేర్కొన్నారు. పాలకుల విధానాలతో విద్య, వైద్యం కూడా ఖరీదు కాగా, పేదలకు కనీస మౌలిక సదుపాయాలను కల్పించడంలో విఫలమయ్యాయని తెలిపారు. అసమానతను నిర్మూలించేలా ఆనాడు పుచ్చలపల్లి సుందరయ్య వేసిన బాట నేటికీ ఆదర్శనంగా నిలుస్తోందని తెలిపారు. ఆయన చూపిన బాటలో కమ్యూనిస్టులు నడుస్తూ పాలకపక్షాల ప్రజావ్యతిరేక విధానాలపై ఉద్యమించాలని జాన్‌వెస్లీ సూచించారు. తొలుత కుర్నవల్లిలో ర్యాలీ నిర్వహించగా, సీపీఎం నాయకులు మాచర్ల భారతి, శీలం సత్యనారాయణరెడ్డి, కల్యాణం వెంకటేశ్వరరావు, తాతా భాస్కర్‌రావు, చలమాల విఠల్, ఫకీరమ్మ, రామలింగేశ్వరరావు, కట్టా దర్గయ్య పాల్గొన్నారు.

పాత స్టాక్‌కు కొత్త ధర!

- అమల్లోకి పెరిగిన మద్యం ధరలు
- ఇదే అదునుగా పాత స్టాక్‌కూ పెంచిన వ్యాపారులు



ఉదయం నిర్మానుష్యంగా ఉన్న వైరాలోని మద్యం డిపో

వైరా: రాష్ట్ర ప్రభుత్వం పెంచిన మద్యం ధరలు సోమవారం నుంచి అమల్లోకి వచ్చాయి. అయితే, వైన్స్, బార్లలో ఇప్పటికే స్టాక్ ఉన్న మద్యాన్ని నిబంధనల ప్రకారం పాత ధరలకే అమ్మాలి. కానీ అధికారులెవరూ ఈ దిశగా దృష్టి సారించకపోవడంతో పాత స్టాక్‌ను సైతం వ్యాపారులు కొత్త ధరతో అమ్మేసి సొమ్ము చేసుకున్నారు. ఉమ్మడి జిల్లాలోని అన్ని మద్యం దుకాణాల్లో ఇదే తంతు కొనసాగింది. ఈ ఏడాది ఫిబ్రవరిలో బీర్ల ధరలు పెంచిన ప్రభుత్వం ఇప్పుడు లిక్కర్ ధరలు పెంచడంతో మద్యం వ్యాపారులకు కాసులు పంట పండినట్లయింది. క్వార్టర్‌పై రూ.10, ఫుల్ బాటిల్‌పై రూ.40 మేర ధర పెంచగా, ఆ ప్రకారమే పాత స్టాక్‌ను సైతం విక్రయించారు. ఉమ్మడి జిల్లాలోని వైన్స్, బార్లకు మద్యం సరఫరా చేసే వైరాలోని ఐఎంఎల్ డిపోలోనే సుమారు లక్ష కేసుల మద్యం పాత స్టాక్ ఉందని అధికారులే చెబుతున్నారు.

కొన్నింటికి మినహాయింపు

ప్రభుత్వం మద్యం ధరలు పెంచినప్పటికీ చీప్ లిక్కర్ జాబితాలో ఉన్న కొన్నింటిని మినహాయించింది. డైమండ్ విస్కీ, కేకే, డాన్‌డాన్, గుడ్‌వన్, డెక్కన్‌బ్లూ, యునైటెడ్ గోల్డు, బీకే, సన్‌హార్స్, మెగాసిటీ బ్రాండ్ల మద్యానికి పాత ధరలే అమల్లో ఉంటాయని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అలాగే, బ్రీజర్ కంపెనీలో కాన్‌బెర్రీ ధరలోనూ మార్పు చేయలేదు. బ్రాండెడ్ మద్యం ధరలే పెంచడంతో ఆదాయం పెంపే లక్ష్యంగా ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. గత ఏడాది మే నెలలో 17వ తేదీ వరకు రూ.237 కోట్ల విలువైన మద్యం అమ్మకాలు జరిగితే ఈ ఏడాది రూ.95 కోట్ల మద్యమే అమ్ముడైంది. మరో పది రోజుల్లో గత ఏడాది కంటే ఎక్కువ అమ్మకాలు చేపట్టాలని ఎక్సైజ్ అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నట్లు సమాచారం.

ఆలస్యంగా అమ్మకాలు

ప్రభుత్వం పెంచిన మద్యం ధరలు సోమవారం అమల్లోకి రాగా వైరాలోని ఐఎంఎల్ డిపో నుంచి మధ్యాహ్నం వరకు లారీలు బయటకు కదల్లేదు. కొత్త ధరలతో బిల్లింగ్ చేసేలా సాఫ్ట్‌వేర్‌లో మార్పులు చేయడంతో ఆలస్యమైందని తెలిసింది. దీంతో మధ్యాహ్నం రెండు గంటల తర్వాత డిపోలో అమ్మకాలు మొదలుకాగా, ఒకేరోజు రూ.12 కోట్ల విలువైన మద్యం తీసుకెళ్లారని సమాచారం.

మందుబాబులకు ముందే కిక్కు

పాల్వంచరూరల్: మద్యంపై పెంచిన ధరలు అమల్లోకి రావడానికి ఇంకాస్త సమయం పడుతుందని భావించిన మందుబాబులకు ఆ ఆనందం దక్కలేదు. పాల్వంచ మండలం పెద్దమ్మగుడి ఆలయం సమీపంలోని వైన్స్‌లో పాత స్టాక్‌నే కొత్త ధరకు అమ్మడంతో వాగ్వాదం జరిగింది. ఈ విషయమై పలువురు ఎక్సైజ్ శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఓ బ్రాండ్ మద్యం క్వార్టర్ ధర రూ.180 ఉంటే పెరిగిన ధరతో కలిపి రూ.190కు, హాఫ్, ఫుల్ బాటిళ్లు కూడా అలాగే అమ్మారని తెలిసింది. ఈవిషయమై ఎక్సైజ్ సీఐ ప్రసాద్‌గౌడ్‌ను వివరణ కోరగా షాపుల్లో ఉన్న పాత స్టాక్‌ను ధర పెంచి అమ్మితే నిర్వాహకులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

పాలకులం కాదు.. మేం సేవకులం

- కాకతీయ వారసుడు కమల్‌చంద్ బంజ్‌దేవ్
- వైభవంగా శ్రీ ఆత్మలింగేశ్వరాలయం పునఃప్రతిష్ఠ



ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన పూజలో కమల్ చంద్, తదితరులు

పాల్వంచ: కాకతీయ రాజుల వంశీయులమైనా తాము పాలకులుగా కాకుండా ప్రజా సేవకులుగానే ముందుకు సాగుతున్నామని బస్తర్ మహారాజు, కాకతీయుల వారసుడు కమల్‌చంద్ బంజ్‌దేవ్ తెలిపారు. పాత పాల్వంచలో కాకతీయ రాజు ప్రతాపరుద్రుడి కాలంలో వెలసిన శ్రీ ఆత్మలింగేశ్వ రాలయం శిథిలావస్థకు చేరడంతో అభివృద్ధి చేశారు. ఈమేరకు ఆలయ ధర్మకర్త మచ్చా శ్రీనివాసరావు ఆధ్వర్యాన సోమవారం ప్రతిష్ఠా మహా కుంభాభిషేక మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఆత్మలింగేశ్వర స్వామితో పాటు ఇతర దేవతామూర్తులు, మహానంది మండపం, ధ్వజస్తంభం ప్రతిష్ఠించారు. ఈ కార్యక్రమంలో కమల్ చంద్ బంజ్‌దేవ్ ముఖ్య అతిథిగా పాల్గొని హంపీ విరూపాక్ష విద్యారణ్య పీఠాధిపతి శ్రీ విద్యారణ్య భారతీ మహా స్వామి సమక్షాన ప్రతిష్ఠ చేశారు. అనంతరం బంజ్‌దేవ్ మాట్లాడుతూ శిథిలావస్థలో ఉన్న ఆలయ నికి పూర్వవైభవం తీసుకొచ్చిన శ్రీనిసరావును, పూజారులు, భక్తులను అభినందించారు. పునఃప్రతిష్ఠాపన ద్వారా ఆలయ చరిత్రను పరమశివుడే తిరిగి రాసినట్లయిందని తెలిపారు. ప్రతిష్ఠాపనాచార్య జక్కి కృష్ణవధాని, ప్రధాన అర్చకులు జితేందర్ శర్మ, బీజేపీ నాయకుడు తాండ్ర వినోద్ రావు, మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు, వరంగల్ పశ్చిమ మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్‌తో పాటు వివిధ పార్టీల నాయకులు వనమా రాఘవేందర్‌రావు, కొత్వాల శ్రీనివాసరావు, నాగ సీతారాములు, మండే వీరహన్మంతరావు, వల్లపు యాకయ్య, యల్లావుల కోటేశ్వరరావు, వెంకన్న, నాగర్జున, కృష్ణ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అర్హత లేని వారితో పనిచేయిస్తే చర్యలు



మాట్లాడుతున్న భాస్కర్‌నాయక్

కొత్తగూడెంఅర్బన్‌: అర్హత లేని వైద్యులు, పారామెడికల్ సిబ్బందితో పనిచేయిస్తున్న ఆస్పత్రులపై కఠిన చర్యలు తీసుకుంటామని డీఎంహెచ్‌ఓ భాస్కర్‌నాయక్ హెచ్చరించారు. సోమవారం జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా అంతటా క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ చట్టాన్ని అమలు చేస్తున్నామని, మినహాయింపు లేకుండా ప్రతి ఆరోగ్య సంరక్షణ కేంద్రంలో అగ్నిమాపక భద్రతా ఆడిట్‌లు నిర్వహిస్తామని తెలిపారు. సమావేశంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ ఎస్.జయలక్ష్మి, డాక్టర్ అర్పీ చైతన్య, డాక్టర్ మధువరుణ్, పుల్లారెడ్డి, తేజశ్రీ, డిప్యూటీ డెమో ఫైజ్మోహియుద్దీన్ పాల్గొన్నారు.

విలువలు కలిగిన రాజకీయ వేత్త సుందరయ్య



సుందరయ్యకు నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): విలువలు కలిగిన రాజకీయాలకు సుందరయ్య నిలువెత్తు నిదర్శనమని సీపీఎం జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. సోమవారం మంచికంటిభవన్‌లో పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. సుందరయ్య జీవితం నేటి తరానికి ఆదర్శమని, ఆయన భూస్వామ్య కుటుంబంలో పుట్టి కూడా చిన్ననాటి నుంచి, అంటరానితనం, కులవివక్ష, అసమానతలకు వ్యతిరేకంగా పోరాడారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సుందరయ్య చేసిన త్యాగాలను పలువురు సీపీఎం నాయకులు వివరించారు.

1008 బ్రహ్మసూత్ర శివలింగాల ప్రతిష్ఠాపన



శివలింగాలను ప్రతిష్ఠిస్తున్న భక్తులు

దుమ్ముగూడెం: మండలంలోని నర్సాపురం గ్రామంలోని శ్రీ ద్వాదశ జ్యోతిర్లింగ చిన్న అరుణాచల ఆలయంలో సోమవారం బ్రహ్మసూత్ర శివలింగాలను ప్రతిష్ఠించారు. ఆలయ వ్యవస్థాపకుడు శివనాగస్వామి ఆధ్వర్యంలో చిన్న అరుణాచలం క్షేత్రంలో వైశాఖ మాసం పంచమితి సోమవారం శ్రవణ నక్షత్రంలో 1008 బ్రహ్మసూత్ర శివలింగాలను 9 అడుగుల బాణలింగాన్ని వేదమంత్రోచ్ఛరణల మధ్య ప్రతిష్ఠించారు.

ఇద్దరిపై దాడి

ఇల్లెందు: ముగ్గురు యువకులు కలిసి మరో ఇద్దరిపై దాడి చేసిన ఘటన ఆజాద్‌నగర్‌లో సోమవారం చోటుచేసుకుంది. ఆజాద్‌నగర్‌లో జరుగుతున్న ఓ ఫంక్షన్‌కు ఆదివారం రాత్రి అదే ప్రాంతానికి చెందిన ఖాదర్‌పాషా బైక్‌పై వచ్చాడు. అక్కడి ముత్యాలమ్మ గుడి వద్ద బైక్ నిలిపి భోజనం చేసి తిరిగి రాగా.. అదే ఏరియాకు చెందిన ఆర్.వంశీ, మధు, సందీప్ బైక్ ఇవ్వమని కోరారు. తాను వెళ్లాల్సి ఉందని వారించటంతో మాటామాటా పెరిగి ఖాదర్‌పాషాపై చేయి చేసుకున్నారు. ఖాదర్‌పాషా మిత్రుడు ఎస్.వంశీ అడ్డురాగా అతనిపై కూడా దాడి చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్‌ఐ బి.సూర్య తెలిపారు.

పిడుగుపాటుతో రైతు మృతి

మరో రైతుకు గాయాలు



పరిటాల పుల్లయ్య (ఫైల్)

ఇల్లెందురూరల్: ఈదురుగాలులతో కూడిన వర్షం కురుస్తున్న సమయంలో పిడుగు పడడంతో ఓ రైతు మృతి చెందగా, ఆయన సోదరుడైన మరో రైతుకు గాయాలయ్యాయి. ఇల్లెందు మండలం కట్టుగూడెం గ్రామానికి చెందిన సోదరులు పరిటాల పుల్లయ్య (40), వెంకన్న తమ పొలం వద్ద పది రోజులుగా బావి తవ్విస్తున్నారు. మధ్యలో మేడారం వన దేవతల దర్శనానికి వెళ్లిరాగా, సోమవారం పనులు తిరిగి ప్రారంభించారు. పని చేయిస్తుండగా వర్షం మొదలుకావడంతో పుల్లయ్య సమీపంలోని చెట్టు కిందకు వెళ్లి తన సోదరుడు వెంకన్నను కూడా పిలిచాడు. వెంకన్న చెట్టు కిందకు వెళ్తుండగానే పిడుగు పడడంతో పుల్లయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. సమీపానికి చేరిన వెంకన్న షాక్‌తో కింద పడ్డాడు. కాగా, మృతుడికి భార్య లలిత, ఇద్దరు కుమారులు ఉన్నారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.20,058

గిరిజన భూములతో వ్యాపారం?

- తక్కువ ధరకు కొనుగోలు చేసి లాభానికి విక్రయం
- నిబంధనలకు విరుద్ధంగా భూబదిలీలు
- గిరిజనులకు అందని భూహక్కు పత్రాలు



దమ్మపేట తహసీల్దార్ కార్యాలయం

దమ్మపేట: జిల్లాలోని దమ్మపేట సహా పలు గిరిజన గ్రామాల పరిధిలో వ్యవసాయ భూములతో గిరిజనేతరులు అక్రమ భూవ్యాపారం చేస్తున్నారు. తరతరాలుగా వ్యవసాయం చేసుకుంటున్న గిరిజనులకు, నూతన పట్టాదారు పాస్ పుస్తకాలు మంజూరు కాక పోగా.. గిరిజనేతర భూవ్యాపారులు అసైన్డ్ భూములను కారుచౌకగా కొనుగోలు చేసి, అడ్డదారిన పీఓటీ చట్టం ద్వారా.. నిబంధనలకు విరుద్ధంగా హక్కు పత్రాలు సృష్టించి.. ఆపై లాభానికి అమ్ముతున్నారనే విమర్శలు వస్తున్నాయి. మండలంలోని నల్లకుంట, గుర్వాయిగూడెం, గండుగులపల్లి, అఖినేపల్లి, ముష్టిబండ తదితర గిరిజన గ్రామాల్లోనే కాక ఇతర చోట్ల కూడా ఈ దందా సాగుతున్నట్లు తెలిసింది. గిరిజన ప్రాంతాల్లోని అసైన్డ్ భూములను కొనుగోలు చేసిన పలువురు.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2004లో జారీ చేసిన జీఓ 1045 ద్వారా అధికారులను మచ్చిక చేసుకుని గుట్టుచప్పుడు కాకుండా పట్టా భూములుగా మార్చారనే ఆరోపణలు వస్తున్నాయి. ఈ అక్రమాల వెనుక దమ్మపేట తహసీల్‌లో కాంట్రాక్టు ఉద్యోగిగా గతంలో పనిచేసిన వ్యక్తి ప్రమేయం ఉందని చెబుతున్నారు. సుమారు 300 ఎకరాలకు పైగా ఈ వ్యాపారం సాగిందని చర్చ నడుస్తోంది. ఈ కారణంగా గిరిజన గ్రామాల్లో వ్యవసాయ భూముల విస్తీర్ణానికి మించి పట్టాదారు పాస్ పుస్తకాలు మంజూరు కాగా, అర్హులైన గిరిజనులకు మాత్రం పుస్తకాలు అందని ద్రాక్షగానే మిగిలాయి. అయితే, కొత్తగా అమల్లోకి వచ్చిన 'భూ భారతి'తోనైనా తమకు న్యాయం జరుగుతుందేమోనని గిరిజనులు ఆశతో ఉన్నారు.

వ్యాపారం ఇలా..

1970–80 దశకాల్లో స్వాతంత్ర్య సమరయోధులు, మాజీ సైనికులు, రాజకీయ బాధితుల కోసం ఇచ్చిన జీఓ 1045ను ఆసరాగా చేసుకుని గిరిజనుల నుంచి ఎకరానికి రూ.లక్ష నుంచి రూ.5 లక్షలు చెల్లించి కొంటున్నారు. ప్రస్తుతం రూ.5 లక్షల నుంచి రూ.15 లక్షలు చెల్లిస్తున్నట్లు సమాచారం. కాగా, మండలంలోని నల్లకుంట సర్వే నంబర్ 273లో గిరిజనేతరుడు ఐదెకరాల భూమిని అక్రమ మార్గంలో పట్టా చేయించినట్లు తెలిసింది. అదే సర్వే నంబర్‌లో ఐదెకరాల అసైన్డ్ భూమిని ఓ వ్యక్తి నుంచి ఎకరాకు రూ.16 లక్షలు చొప్పున కొనుగోలు చేసిన వ్యక్తులు, పట్టా చేయించాక ఎకరం రూ.31లక్షలకు విక్రయించారు. అఖినేపల్లి రెవెన్యూ పరిధి సర్వే నంబర్ 290లో ఐదెకరాల ప్రభుత్వ భూమిని వారసత్వం పేరుతో ధరణిలో పట్టా భూమిగా మార్చి, ఇప్పుడు రూ.16 లక్షలు ఎకరం చొప్పున విక్రయించారనే ప్రచారం జరుగుతోంది.

పైసలిస్తేనే పాస్ పుస్తకం



గిరిజనుల సాగు భూమి అయినా పైసలిస్తేనే పట్టాదారు పాస్ పుస్తకం అన్న రీతిలో కొందరు ఉద్యోగులు వ్యవహరిస్తున్నారు. డబ్బులు ఇవ్వలేని వారు రైతు భరోసా, రుణమాఫీకి దూరమవుతున్నారు. పీఓటీ చట్టానికి వ్యతిరేకంగా జరిగిన లావాదేవీలపై విచారణ జరిపించాలి.
–వాడే వీరస్వామి, ఆదివాసీ నాయకుడు

గిరిజన ప్రాంతాల్లో వ్యాపారం ఆపాలి



1990 నుంచి గొర్రెగుట్టలో 6 – 30 ఎకరాల భూమిని సాగు చేసుకుంటుండగా.. పాత పట్టాదారు పాస్ పుస్తకం ఉన్నా ధరణి వచ్చాక కొత్తది ఇవ్వలేదు. దీంతో నేను రైతు భరోసా, ఇతర రాయితీలను కోల్పోయా. దొడ్డిదారిలో కొందరు అన్ని హక్కులు సాధిస్తున్నారు.
–వాడే కన్నమ్మ, గొర్రెగుట్ట

పట్టాదారు పుస్తకం మంజూరు కాలేదు..



నేను 30 ఏళ్లుగా గొర్రెగుట్టలో 2 – 30 ఎకరాల భూమి సాగు చేస్తున్నా. పాత పాస్ పుస్తకాలు ఉన్నప్పటికీ ధరణి వచ్చాక కొత్తవి మంజూరు కాలేదు. పలుమార్లు తహసీల్ చుట్టూ తిరిగినా ప్రయోజనం లేదు. అధికారులు, ఎమ్మెల్యే స్పందించి మాలాంటి వారికి న్యాయం చేయాలి. –వాడే వీరవెంకటమ్మ, గొర్రెగుట్ట

ఇక ఆటలు ఆడుకోవచ్చు..

- భద్రాద్రిలో క్రీడా మైదానం ఏర్పాటుకు అడుగులు
- ఐటీడీఏ పీఓ చొరవతో స్థల సేకరణ
- తీరనున్న క్రీడాకారుల కళ



స్థలాన్ని పరిశీలిస్తున్న పీఓ రాహుల్, అధికారులు (ఫైల్)

భద్రాచలంటౌన్: భారత మహిళా క్రికెట్ జట్టులో స్థానం సాధించిన గొంగడి త్రిష భద్రాద్రిలో తొలుత శిక్షణ తీసుకున్న విషయం తెలిసిందే. కానీ, ఇక్కడ క్రీడామైదానం లేకపోవడం క్రీడాకారులకు ఎంతో లోటు. క్రీడాకారులు శిక్షణ పొందాలన్నా.. పోటీలు నిర్వహించాలన్నా.. స్థానికంగా ఉన్న జూనియర్ కళాశాల క్రీడా మైదానమే పెద్ద దిక్కు. ఈ విషయాన్ని స్థానిక క్రీడాకారులు, యువకులు అనేక సార్లు ఉన్నతాధికారులకు విన్నవించుకున్నా ప్రతిఫలం దక్కలేదు. ఇటీవల ఐటీడీఏ పీఓ పట్టణంలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించారు. క్రీడా మైదానానికి కేటాయించేలా సర్వే చేసి పూర్తి నివేదికను అందజేయాలని ఆదేశించారు. ఈ ప్రక్రియ కార్యరూపం దాల్చి నూతన హంగులతో క్రీడా మైదానం అందుబాటులో రావాలని క్రీడాకారులు ఆకాంక్షిస్తున్నారు.

మెగా టోర్నీలకు వేదికగా..

ఏటా నిర్వహించే భద్రాద్రి కప్‌తో పాటు జాతీయస్థాయిలో నిర్వహించే నెహ్రూకప్‌నకు భద్రాద్రి ఆతిథ్యం ఇస్తోంది. కానీ, సరైన మైదానం లేక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానాన్నే సర్దుకోవాల్సి వస్తోంది. ఐటీడీఏ తరఫున నిర్వహించే క్రీడాపోటీలు సైతం ఇక్కడే నిర్వహిస్తారు. అయితే, ఇదే మైదానాన్ని ఇతర కార్యక్రమాలకు కూడా అద్దెకు ఇవ్వడంతో తిరిగి క్రీడలు నిర్వహించే సమయంలో అసౌకర్యంగా ఉంటోంది. దీంతో క్రీడాకారులు, క్రీడాభిమానుల ఏళ్లుగా విన్నవిస్తున్నా కార్యరూపం దాల్చలేదు.

ఐదెకరాల్లో ప్రణాళిక

పట్టణంలోని సుందరయ్యనగర్ కాలనీలో ఉన్న 5 ఎకరాల్లో స్టేడియం ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. ఈ భూమి క్రీడా మైదానానికి కేటాయించేలా ప్రణాళికలు రూపొందించాలని సంబంధిత ఇంజనీరింగ్ అధికారులను పీఓ రాహుల్ ఆదేశించారు. ఆయనే స్వయంగా వెళ్లి సదరు ప్రాంతాన్ని రెవెన్యూ అధికారులతో కలిసి పరిశీలించారు. కాగా, ఈ భూమి గతంలో పంచాయతీకి అప్పగించారు. ప్రస్తుతం ఈ భూమిని మైదానం ఏర్పాటుకు కేటాయించారు కాబట్టి తిరిగి పంచాయతీ అధికారుల నుంచి తీసుకోవాలి. ఈ ప్రక్రియను వేగంగా పూర్తయితే స్టేడియం పనులకు అడుగులు పడతాయి.

యువతను ప్రోత్సహించేందుకే..



భద్రాచలంలో క్రీడలపై ఆసక్తి ఉన్న యువతను ప్రోత్సహించేందుకే స్టేడియం ఏర్పాటు చేయాలనుకున్నాం. ఆటలు ఆడుకోవడానికి సరైన క్రీడా ప్రాంగణాలు లేవు. సుందరయ్యనగర్‌లో ఉన్న 5 ఎకరాల ప్రభుత్వ భూమినిలో స్టేడియం ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించాను.
–బి.రాహుల్, ఐటీడీఏ పీఓ, భద్రాచలం

సరైన మైదానం లేక ఇబ్బందులు



భద్రాచలం పట్టణంలో ఏళ్లుగా సరైన క్రీడా మైదానం లేదు. ప్రతీ సారి ఇక్కడి క్రీడాకారులు జూనియర్ కళాశాల క్రీడా మైదానంలోనే పోటీలతో పాటు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తారు. పూర్తిస్థాయి మైదానం ఏర్పాటుకు అడుగులు పడడం శుభ పరిణామం.
–నగేశ్, భద్రాచలం

మైదానం అవసరం ఉంది



భద్రాచలం పట్టణంతో పాటు సరిహద్దు మండలాల క్రీడాకారులు ప్రాక్టీస్ చేయడానికి పూర్తిస్థాయి వసతులతో క్రీడా మైదానం అవసరం ఉంది. అనేక సార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ఇప్పుడు పీఓ స్టేడియం ఏర్పాటుకు చొరవ తీసుకోవడం హర్షనీయం.
–కుప్పాల చరణ్ తేజ, క్రికెట్ కోచ్, భద్రాచలం

గిరిజనుల సమస్యల పరిష్కారానికి కృషి

ఐటీడీఏ పీఓ రాహుల్



వివరాలు తెలుసుకుంటున్న పీఓ రాహుల్

భద్రాచలంటౌన్: గిరిజన, ఆదివాసీల సమస్యలు పరిష్కరించడమే కాక అర్హులకు ప్రభుత్వ పథకాలు అందేలా కృషి చేస్తామని ఐటీడీఏ పీఓ బి.రాహుల్ తెలిపారు. భద్రాచలం ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గిరిజన దర్బార్‌లో ఆయన దరఖాస్తులు, వినతిపత్రాలు స్వీకరించాక మాట్లాడారు. పోడు భూముల, వ్యక్తిగత, భూ సమస్యలు, స్వయం ఉపాధి పథకాలు, పట్టా భూములకు రైతుబంధు, జీవనోపాధి పెంపొందించుకోవడానికి ఆర్థిక సాయం, ట్రైకార్ రుణాలు, గిరి వికాసం ద్వారా సోలార్ విద్యుత్ కనెక్షన్లు తదితర అంశాలపై వినతులు రాగా పరిష్కారంపై ఉద్యోగులకు పీఓ సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏపీఓ డేవిడ్‌రాజ్, డీడీ మణెమ్మ, ఆర్‌సీఓ అరుణకుమారి, వివిధ విభాగాల ఉద్యోగులు రవీంద్రనాథ్, భాస్కరన్, వేణు, లక్ష్మీనారాయణ, మనిధర్, ఉదయ్‌కుమార్, సమ్మయ్య, ఆదినారాయణ, నారాయణరావు, చైతన్య, హరికృష్ణ పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం



శ్రీను (ఫైల్)

జూలూరుపాడు: మండలంలోని గాంధీనగర్ గ్రామ పంచాయతీ గంగారంతండాకు చెందిన మాలోత్ శ్రీను (46) సోమవారం తెల్లవారుజాము నుంచి కనిపించకుండా పోయాడు. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. శ్రీను ఆదివారం రాత్రి భోజనం చేసి పడుకున్నాడు. సోమవారం తెల్లవారుజామున చూస్తే లేడు. ఆచూకీ కోసం ఇరుగు, పొరుగు, బంధువుల ఇళ్లల్లో వెతికినా దొరకలేదు. దీంతో పోలీసులను ఆశ్రయించామని కుటుంబ సభ్యులు వెల్లడించారు. శ్రీను ఆచూకీ తెలిస్తే 62815 56580, 99082 50862 నంబర్లలో సంప్రదించాలని కుటుంబ సభ్యులు కోరారు.

బైక్‌లపైకి దూసుకొచ్చిన బొలేరో



వాహనం కింద నలిగిన ద్విచక్రవాహనాలు

బూర్గంపాడు: మోరంపల్లిబంజర గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనాలపైకి అటుగా వెళ్తున్న బొలేరో వాహనం అదుపుతప్పి దూసుకువచ్చింది. సోమవారం జరిగిన ఈ ఘటనలో మూడు ద్విచక్ర వాహనాలు దెబ్బతిన్నాయి. ఈ ఘటన జరిగినప్పుడు ఆ ప్రాంతంలో ఎవరూ లేకపోవటంతో ప్రమాదం తప్పింది. ఈ ఘటనపై బాధితులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

కేర్ టేకర్‌గా చేరి రూ.11.49లక్షలు స్వాహా



నిందితుడితో డీఎస్పీ, ఉద్యోగులు

ఖమ్మంక్రైం: ఆన్‌లైన్ బెట్టింగ్‌కు అలవాటు పడిన ఓ వ్యక్తి రిటైర్డ్ ఉద్యోగి వద్ద కేర్ టేకర్‌గా చేరి ఆయనకు తెలియకుండా ఖాతా నుంచి రూ.11.49 లక్షలు స్వాహా చేశాడు. ఈమేరకు నిందితుడిని సోమవారం ఖమ్మం సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్టు చేశారని పోలీసు కమిషనర్ సునీల్‌దత్ తెలిపారు. మధిర మండలం నిదానపురానికి చెందిన గుండా వెంకటేశ్వరరెడ్డి ఖమ్మం హోమ్ కేర్ సర్వీస్‌లో కేర్ టేకర్‌గా ఉద్యోగం చేస్తున్నాడు. గత నాలుగైదేళ్లుగా ఆన్‌లైన్ బెట్టింగ్‌కు పాల్పడుతున్న ఆయన గత మార్చిలో ఖమ్మంకు చెందిన రిటైర్డ్ ఉద్యోగి గాదె కేశవరావు వద్ద కేర్ టేకర్‌గా చేరాడు. యజమానిని నమ్మిస్తూ ఆయన ఫోన్‌లోని గూగుల్ పే ద్వారా బెట్టింగ్ యాప్‌ల్లోకి డబ్బు డిపాజిట్ చేయడం మొదలుపెట్టాడు. రెండు వారాల పాటు వరుసగా రూ.11.49 లక్షల డిపాజిట్ చేయగా, లాభాలు రాకపోవడంతో ఉద్యోగం మానేశాడు. కొన్నాళ్ల తర్వాత గుర్తించిన కేశవరావు ఈ విషయమై చేసిన ఫిర్యాదుతో వెంకటేశ్వరరెడ్డిని అదుపులోకి తీసుకుని విచారించడంతో నేరం చేసినట్లు ఒప్పుకున్నాడు. దీంతో కోర్టులో హాజరుపర్చగా, సైబర్ క్రైమ్ డీఎస్పీ ఫణిందర్‌ను, ఎస్సైలు రంజిత్‌కుమార్,విజయ్‌కుమార్, సిబ్బందిని పోలీస్ కమిషనర్ అభినందించారు.

సీతారాంపురంలో విషాదం



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

మేడారం వెళ్లి వస్తూ రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

అశ్వాపురం: మండలంలోని సీతారాంపురం గ్రామంలో విషాదం నెలకొన్నది. గ్రామానికి చెందిన కొందరు బంధువులు మేడారం సమ్మక్క – సారలమ్మకు మొక్కులు చెల్లించేందుకు ఈ నెల 17న ఒక ట్రాక్టర్, ఒక ఆటోలో మేడారం వెళ్లారు. ఈ నెల 18న తిరుగుపయనమయ్యారు. తాడ్వాయి వద్ద మంచినీరు తాగేందుకు ట్రాక్టర్ రహదారి వెంబడి ఆపారు. ఈ క్రమంలో వెనుక వచ్చిన ఇసుక లారీ ట్రాక్టర్‌ను ఢీకొట్టడంతో నూప దుర్గ (38), చెట్టిపల్లి సీతమ్మ (40) మృతి చెందారు. ట్రాక్టర్‌లోని మిగతావారంతా గాయపడగా వారిని ములుగు, వరంగల్ ఎంజీఎం ఆస్పత్రులకు తరలించారు. కాగా, గాయపడిన వారిలో చెట్టిపల్లి ముత్తమ్మ, చెట్టిపల్లి సునీత, మోడియం సమ్మయ్య, మోడియం రాకేశ్, మణుగూరు మండలం కూనవరానికి చెందిన వెల్లుబోయిన శంకర్, ఏపీ రాష్ట్రం కుక్కునూరు మండలం కమ్మరిగూడెంనకు చెందిన గొల్ల జంపన్న ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. సీతారాంపురం గ్రామానికి చెందిన కోండ్రు శ్రీను, నూప నరసింహ, చెట్టిపల్లి శ్రీకృష్ణ, ఈసం జీవన్, మొడియం వినయ్, సుజాత ములుగు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. మృతుల కుటుంబ సభ్యులు చెట్టిపల్లి సింధు, చెట్టిపల్లి విష్ణు, కారం వంశీ, సౌందర్యను డిశ్చార్జ్ చేశారు. ప్రమాదంలో మృతి చెందిన ఇద్దరు, గాయాలపాలైన వారంతా నిరుపేదలే. క్షతగాత్రుల్లో చిన్న పిల్లలు కూడా ఉన్నారు. అంబులెన్స్‌కు చెల్లించేందుకు సైతం డబ్బు లేకపోవడంతో పలువురు సామాజిక మాధ్యమాల్లో విరాళాలు సేకరించి అందజేశారు. కాగా, ప్రమాదంపై మంత్రి సీతక్క, పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

పిడుగుపాటుతో దంపతులకు గాయాలు

- పెంపుడు కుక్క సహా 22 మూగజీవాలు మృతి

కారేపల్లి: పిడుగుపాటుతో ఇద్దరు జీవాల కాపరులకు తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటనలో వీరు మేతకు తీసుకొచ్చిన 21 గొర్రెలు, ఒక కుక్క మృత్యువాత పడింది. మండలంలోని బాజుమల్లాయిగూడెంకు గొర్రెల కాపరులు మద్దెల లక్ష్మయ్య –లక్ష్మి 100జీవాలను సోమవారం సమీపంలోని పాటిమీదిగుంపు గ్రామంలో మేతకు తీసుకెళ్లారు. సాయంత్రం ఒక్కసారిగా ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం మొదలు కావడంతో సమీపంలోని చెట్టు కిందకు చేరగా వేపచెట్టుపై పిడుగు పడింది. దీంతో లక్ష్మయ్య–లక్ష్మి దంపతులు తీవ్రగాయాలతో స్పృహ కోల్పోగా, 17 గొర్రెలు, వారి పెంపుడు కుక్క మృతి చెందింది. అలాగే, పిడుగుపాటుతో చెట్టు సగం మేర కాలిపోయింది. అరగంట తర్వాత స్పృహలోకి వచ్చిన లక్ష్మయ్య ఫోన్ ద్వారా గ్రామస్తులకు సమాచారం ఇవ్వడంతో సస్థానికులు చేరుకుని వారిని ఖమ్మం ఆస్పత్రికి తరలించారు.

వృద్ధురాలి ఆత్మహత్య

అశ్వాపురం: మండల కేంద్రానికి చెందిన సారంగి సరోజిని (60) పురుగులమందు తాగి ఆత్మహత్య చేసుకుంది. కొంతకాలంగా ఆమె అనారోగ్యంతో బాధపడుతూ.. మతిస్థిమితం కోల్పోయింది. ఆదివారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగులమందు తాగింది. అపస్మారక స్థితిలో ఉన్న ఆమెను కుటుంబ సభ్యులు అశ్వాపురం పీహెచ్‌సీకి తరలించి మెరుగైన వైద్యం కోసం భద్రాచలం తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ మధుప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మరిది వేధింపులతో వదిన..

పాల్వంచ: మరిది వేధింపులు తాళలేక వదిన ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసుల కథనం మేరకు.. సుజాతనగర్ మండల కేంద్రానికి చెందిన బత్తుల వీరయ్యకు త్రివేణి(32)తో గతంలో వివాహం జరిగింది. వీరికి నాలుగేళ్ల కుమార్తె ఉంది. కొంతకాలంగా త్రివేణి మరిది అయిన టీఎస్‌పీఎస్ కానిస్టేబుల్ బత్తుల నాగరాజు వేధింపులకు గురిచేస్తున్నాడు. ఆమె పర్సనల్ ఫొటోలను బంధువులు, తెలిసిన వారికి ఫోన్‌లో పంపిస్తున్నాడు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురై నాలుగు రోజుల కిందట పాల్వంచ వికలాంగుల కాలనీలో ఉంటున్న తండ్రి శివ ఇంటికి వచ్చింది. సోమవారం ఫైపోర్షన్‌కు వెళ్లి చీరతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి తండ్రి శివ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ సుమన్ తెలిపారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో భారీ నష్టం


ఫర్టిలైజర్ షాప్‌లో రూ.కోట్ల విలువైన సామగ్రి దగ్ధం



దుకాణంలో పరిశీలిస్తున్న డీఎస్పీ చంద్రభాను తదితరులు

ఇల్లెందు: విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల దుకాణం దగ్ధమైంది. ఇలెందు మెయిన్‌రోడ్‌లోని శ్రీ ఆదిత్యసాయి ఎంటర్‌ప్రైజెస్‌లో ఆదివారం రాత్రి 12 గంటల సమయంలో ఈ ప్రమాదం సంభవించింది. దుకాణంలోని ఎరువులు, పురుగుమందులు, విత్తనాలు.. సుమారు రూ.2.70 కోట్ల సరుకు కాలిపోయినట్లు అంచనా. అగ్నిమాపక శాఖ సిబ్బంది చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. కాగా, సోమవారం ఏఓ సతీశ్ దుకాణాన్ని పరిశీలించి రికార్డుల ఆధారంగా నష్టంపై అంచనా వేశారు. ఎమ్మెల్యే కోరం కనకయ్య, అగ్నిమాపకశాఖ అధికారి నవీన్, డీఎస్పీ చంద్రభాను, సీఐ సత్యనారాయణ, విద్యుత్ శాఖ ఏడీఈ కోటేశ్వరరావు పరిశీలించి వివరాలు ఆరా తీశారు. దుకాణంలోని 80 శాతం సరుకు అగ్నికి ఆహుతైందని యజమాని ప్రొద్దుటూరి నాగేశ్వరరావు తెలిపారు.

విద్యుదాఘాతంతో మూడు పశువులు మృతి



మృతిచెందిన పశువులు

చంద్రుగొండ: మండలంలోని సత్యనారాయణపురం శివారు రైల్వేలైన్ సమీపంలో విద్యుదాఘాతానికి గురై మూడు పశువులు మృతి చెందిన ఘటన సోమవారం వెలుగుచూసింది. బాధిత రైతుల కథనం ప్రకారం.. గానుగపాడు వాసి వెంకన్నకు చెందిన రెండు పాడిగేదెలు, సత్యనారాయణపురంవాసి భాగ్యరాజుకు చెందిన దుక్కిటెద్దు ఆదివారం మేతకు వెళ్లాయి. రైల్వేలైన్ సమీపంలో త్రీఫేస్ విద్యుత్ వైరు కిందపడి ఉండటంతో విద్యుదాఘాతానికి గురై మూడు పశువులు అక్కడికక్కడే మృత్యువాత పడ్డాయి. ఒక్కో పశువు విలువ రూ.లక్ష ఉంటుందని బాధిత రైతులు తెలిపారు. కాగా, గాలిదుమారం, పిడుగుపాటుకు గానుగపాడు, సత్యనారాయణపురం మధ్య విద్యుత్‌లైన్ ఇన్సులేటర్లు ఫెయిల్ అయి తీగలు కిద్దపడ్డాయని, ఒక్కో పశువుకు శాఖ తరపున రూ.40 వేలు పరిహారం అందిస్తామని విద్యుత్ అధికారులు పేర్కొన్నారు.

ఈతకు వెళ్లిన బాలుడికి షాక్

ఆస్పత్రికి తరలించేలోగా మృతి



టిల్లు (ఫైల్)

కొత్తగూడెంఅర్బన్: లక్ష్మీదేవిపల్లి మండలం అశోక్‌నగర్ వద్ద మొర్రేడు వాగులో ఈతకు వెళ్లిన బాలుడు.. అక్కడే మోటార్‌కు అమర్చిన విద్యుత్‌వైరు తాకి.. షాక్‌కు గురై మృతి చెందాడు. ఈ ఘటన సోమవారం చోటుచేసుకుంది. కొత్తగూడెం మున్సిపాలిటీ న్యూగొల్లగూడెంనకు చెందిన టిల్లు (15) తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. వేసవి సెలవులు కావడంతో మొర్రేడు వాగులో ఈతకు వెళ్లాడు. వాగులో మోటారుకు అమర్చిన విద్యుత్ తీగ షాక్ కొట్టడంతో స్పృహ కోల్పోయాడు. గమనించిన స్థానికులు టిల్లును కొత్తగూడెం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. టిల్లు మృతదేహాన్ని సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా సందర్శించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

అశ్వాపురం: మండలంలోని బీజీకొత్తూరు వద్ద ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంపై సోమవారం పోలీసులు కేసు నమోదు చేశారు. బూర్గంపాడు మండలం బుడ్డగూడెం గ్రామానికి చెందిన సోడె శ్రీకాంత్ (26) బైక్‌పై మణుగూరు మండలం పగిడేరులో పెళ్లికి వెళ్లి తిరిగి వస్తున్నాడు. బీజీ కొత్తూరు వద్ద ధాన్యం కొనుగోలు కేంద్రం నుంచి ట్రాక్టర్ రోడ్డుపైకి వస్తూ బైక్‌ను ఢీకొనడంతో శ్రీకాంత్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఆస్పత్రికి 108లో తరలిస్తుండగా మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ మధుప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.